క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్‌లు పరిశీలించిన కమిషనర్



నందిగామ: పట్టణ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్‌లను సోమవారం పట్టణ మున్సిపల్ కమిషనర్, ఏఆర్‌ఓ కె.హేమమాలిని పరిశీలించారు. ఆయా పోలింగ్ స్టేషన్ లలో కల్పించవలసిన ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో 71 వ రామకోటి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు ఆలయంలోని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రాల నడుమ శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కోర్టు ప్రాంగణాలు ప్రారంభం



నందిగామ: పట్టణంలో నూతనంగా నిర్మించిన కోర్టు ప్రాంగణాలను మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ ప్రాంగణాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను సోమవారం స్థానిక జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోర్టు ప్రాంగణాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో పాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు రానున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ప్రారంభోత్సవానికి సంబంధించి అన్ని పనులు పూర్తయినట్లు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఆయా కోర్టుల న్యాయమూర్తులు లక్ష్మీరాజ్యం, షేక్ రియాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ మెటీరియల్‌పై ఎగ్జిబిషన్



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రీస్కూల్ మెటీరియల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్‌లో పిల్లలు తయారు చేసిన బొమ్మలను తల్లులకు చూపించేందుకు ఎగ్జిబిషన్ నిర్వహించారు. పిల్లలకు అందిస్తున్న విద్య, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, జ్యోతి, నిర్మల, ఎంఎస్‌కే నాగలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి రూ.50,460 విరాళాన్ని ఓ భక్తుడు అందజేసినట్లు ఆలయ చైర్మన్ భరద్వాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉప్పుటూరి శ్రీనివాస్ విరాళాన్ని అందించారన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవాబుపేటలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటుచేయాలి

పెనుగంచిప్రోలు: మండలంలోని నవాబుపేట గ్రామంలో పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలంటూ గ్రామానికి చెందిన నాయకులు అక్కయ్య గౌడ్ ఎస్‌ఐ పి.రాంబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గతంలో ఔట్ పోస్టు ఉండేదని, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తుగా ఏర్పాటు చేయాలని కోరారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

యాదవుల ఆత్మీయ సభలో ప్రభుత్వవిప్ ఉదయభాను



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఉదయభాను, పక్కన నెడ్‌కాప్ చైర్మన్ రవికుమార్, ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు ఎంపీపీ గాంధీ తదితరులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక కంఠంనేని గార్డెన్స్‌లో సోమవారం నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రముఖ ఆలయం శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ పదవితో పాటు, జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ చరిత్రలో మొదటి సారిగా బీసీ వర్గానికి చెందిన యాదవులకు ఇచ్చామన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎంపీపీ పదవులు, కార్పొరేటర్లు ఇలా బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, మైనార్టీలకు అనేక పదవులు ఇచ్చామని, టీడీపీ పాలనలో గత ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ బీసీలకు ఏం చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. బీసీ హక్కుల కోసం పోరాడే ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులను రాజ్యసభకు పంపిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. బీసీలంటే బ్యాక్ బోన్ అని అనడమే కాదు ఆచరణలో చేసి చూపించారన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థులుగా 59 స్థానాలను బీసీలకు కేటాయించారని, గత సార్వత్రిక ఎన్నికల కంటే 11 స్థానాలు అధికంగా ఇచ్చారన్నారు.

సమావేశంలో నెడ్‌కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి చెందిన తనకు కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఉదయభానుకు దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో గానీ, నామినేటెడ్ పదవుల్లో గానీ సింహభాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయంటే ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే చెందుతుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అన్ని రకాలుగా న్యాయం జరగాలంటే రాష్ట్రంలో సీఎం జగనన్న, విజయవాడ ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా ఉదయభానును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు సంపత్ విజిత, ఎంపీపీ మార్కపూడి గాంధీ, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి భవానీప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మాదల వీరయ్య చౌదరి, సొసైటీ అధ్యక్షుడు కోనంగి ముక్కంటి, యాదవ సంఘ నాయకులు పాదిలి లక్ష్మీనారాయణ, పేరయ్య, యలమందరావు, దర్శి వెంకటేశ్వరరావు, జానకిరామయ్య, శ్రీనివాసరావు, కె.గోపి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం



నందిగామలోని ఓ పరీక్ష కేంద్రంలో రూమ్ నంబరు వెతుక్కుంటున్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు



పేటలో జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

నందిగామ: డివిజన్‌లో సోమవారం ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో ప్రతి విద్యార్థి లోనూ టెన్షన్ కనిపించింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోసం చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. నందిగామ ఉప విద్యా శాఖాధికారి కార్యాలయ పరిధిలోని తొమ్మిది మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 54 సెంటర్లలో 8,846 మంది విద్యార్థులకు గాను 8,532 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షకు హాజరయ్యారని, 314 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీవైఈఓ ఎం.వెంకటప్పయ్య తెలిపారు. నందిగామ మండలంలో మొత్తం 8 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాలలో 1,547 మంది విద్యార్థులకు గాను 1,506 మంది విద్యార్థులు హాజరయ్యారు.41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చందర్లపాడు మండలంలో మొత్తం 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆయా కేంద్రాలలో 751 విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 718 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే దాదాపు 90 శాతం మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. హాల్ టికెట్ నంబరు చూసుకోవడం మొదలు పరీక్ష హాలులోకి వెళ్లే వరకు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎన్నో జాగ్రత్తలు చెప్పటం కన్పించింది.

పేటలో ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: పదవ తరగతి పరీక్షలు పట్టణంలో సోమవారం ప్రశాంతంగా ఆరంభమయ్యాయి. పేట పట్టణంలోని ఏడు సెంటర్లతో పాటు మండలంలో 3 సెంటర్లకు కలిపి మొదటి రోజున తెలుగు పరీక్షకు 1,779 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా వారిలో 23 మంది గైర్హాజరయ్యారు. 1,756 మంది పరీక్ష రాశారు. సెంటర్ల వారీ హాజరైనవారిలో పేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్-ఎ లో 230 మందికి గాను 230 మంది, బాలుర హైస్కూల్-బి లో 173 మందికి గాను 162 మంది, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో 108 మందికి గాను 106 మంది, విజ్ఞాన్ హైస్కూల్‌లో 147 మందికి గాను 147 మంది, శ్రీచైతన్య స్కూల్‌లో 147 మందికి గాను 147 మంది, తపోవన్ విద్యాలయంలో 220 మందికి గాను 220 మంది, చేగు విద్యాలయంలో 217 మందికి గాను 217 మంది, చిల్లకల్లులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 92 మందికి గాను 88 మంది, చిల్లకల్లు ఆల్ సెయింట్స్ స్కూల్‌లో 178 మందికి గాను 178 మంది, గండ్రాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 267 మందికి గాను 261 మంది హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్టు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, ఎంఈవో ఎల్.చిట్టిబాబు తెలిపారు. సీఐ జానకీరామ్ ఆధ్వర్యంలో పేట, చిల్లకల్లు ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, సతీష్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో మొత్తం 558 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు 548 మంది హాజరవగా, 10 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ డి.రవీంద్ర తెలిపారు. కేవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 196 మందికి 187 మంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 145 మందికి 145 మంది, శ్రీచైతన్య స్కూల్‌లో 217 మందికి 216 మంది హాజరైనట్టు తెలిపారు.

వత్సవాయిలో...

వత్సవాయి: మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు కలిపి మొత్తం 526 మంది ఉండగా వారిలో బాలురు 282, బాలికలు 244 ఉన్నారు. వారిలో తెలుగు మీడియం 217, ఇంగ్లిషు మీడియం 309 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు ఎంఈవో ఎల్.నాగరాజు తెలిపారు. వత్సవాయి జెడ్పీ పాఠశాలలో రెండు సెంటర్లను ఏర్పాటుచేశారు. ఏ సెంటర్‌లో 220, బీ సెంటర్‌లో 181 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలలో 959 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 922 మంది రాశారని, 37మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ బి.బాలాజీ తెలిపారు. కంచికచర్ల అక్షర స్కూల్‌లో 11మంది, విజయరాణి ఏ సెంటర్‌లో ఇద్దరు, బీ సెంటర్‌లో ఇద్దరు, జిల్లా పరిషత్ స్కూల్‌లో ఆగురుగు, ఉషోదయ స్కూల్‌లో ఏడుగురు, పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో తొమ్మిది మంది గైర్హాజరయ్యారని వివరించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలిపారు.

వీరులపాడులో...

వీరులపాడు: మండలంలోని అల్లూరు, జుజ్జూరు, జయంతి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఎంఈవో పాల్ కెనడీ తెలిపారు. మండలంలో మొత్తం 511 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 71 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. తహసీల్దార్ రాజకిషోర్ ఆయా గ్రామాల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



వత్సవాయి నుంచి పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



పార్టీలో చేరిన విలియంపేట వారిని ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీఎత్తున చేరికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం మండల కేంద్రం వత్సవాయి బీసీ కాలనీ నుంచి నలుగురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ లోకి చేరారు. బీసీ కాలనీకి చెందిన షేక్ యాసిన్, షేక్ సైదా గత 20 ఏళ్లుగా టీడీపీలో ఉన్నప్పటికీ తమకు తగిన న్యాయం జరగకపోవడంతో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో తాము వేరే పార్టీ అయినప్పటికీ అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, నియోజకవర్గంలో ఉదయభాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన జాన్ సైదా, నాగుల్‌మీరా ఇటీవల కొన్ని అనివార్య కారణాలతో వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరారు. అయితే వారు అక్కడ ఇమడలేక, తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని విలియంపేటకు చెందిన మారేపల్లి రాజు(క్రీస్తురాజు), ఉప్పెల్లి ఏసు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ సమక్షంలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ స్థానిక నాయకులు ఉప్పెల్లి ప్రసన్నకుమార్, మల్లెల సాయి, యేసుపొంగు కృపారావు, ప్రకాష్, దున్నా దుర్గారావు తదితర విలియంపేట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లెక్సీలు తొలగించాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించాలని ఎంపీడీవో రమేష్‌బాబు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని గ్రామాల్లో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను సిబ్బంది వెంటనే తొలగించాలని చెప్పారు. రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని చెప్పారు.

శిలువమార్గం నిర్వహించిన క్రైస్తవులు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మానవుల పాపాల పరిహారార్థం ప్రభువు ఏసుక్రీస్తు శిలువను ధరించాడని ఆర్‌సీఎం ఫాదర్ కూరపాటి బాల అన్నారు. చర్చి ఆధ్వర్యంలో గ్రామం నుంచి ముచ్చింతాల వరకు క్రైస్తవులు సోమవారం శిలువ మార్గం నిర్వహించారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి అందరూ సహకరించాలి

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నాగకుమారి



పేట పట్టణంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

జగ్గయ్యపేటఅర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడి, ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ మొదలైనందున అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు తమ విధులకు సహకరించాలని జగ్గయ్యపేట ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నాగకుమారి విజ్ఞప్తిచేశారు. పట్టణంతో పాటు మండలంలో ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడల మీద పెయింటింగ్‌లు, రాతలు, పార్టీల జెండాలు, జెండా గుర్తులను తొలగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నేతల ఫొటోల తొలగింపు, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయిస్తున్నామన్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా తొలగించుకుంటే మంచిదేనన్నారు. ప్రతి దానికి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, లేకుంటే ఎన్నికల ఖర్చు కింద రాయాల్సివస్తుందని హెచ్చరించారు.

ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ట

కీసర(కంచికచర్ల): మండలంలోని ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమయింది. ఈనెల 22వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. యాగశాలలో సోమవారం వేద పండితులు మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రాయశ్చిత్తం, గోపూజ, పంచగవ్య ప్రాసన, దీక్షా కంకణధారణ, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన, అంకురారోపణ, నీరాజన మంత్ర పుష్పములు తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ చేసిన ఆర్డీఓ



మండలంలోని చందాపురం సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: ఎన్నికల నియమావళి పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మండలంలోని పలు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ప్రతి ప్రభుత్వ అధికారి, సిబ్బంది కచ్చితంగా ఎన్నికల నియమావళి పాటించాలన్నారు.

ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

నందిగామ: ఎమ్మార్పీఎస్ ఆంధ్ర కార్యకర్తల సమావేశం సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ మాదిగ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో వచ్చే నాయకుల హామీలు, వర్గీకరణ అంశాలకు సంబంధించి చర్చించారు. మాయమాటలు చెప్పే నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనకపూడి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఎమ్మార్పీఎస్ ఆంధ్ర నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు పరిశీలించాలి

జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి



పేట తహసీల్దార్ కార్యాలయంలో రూట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేటఅర్బన్: రూట్ ఆఫీసర్లు వారి రూట్‌లో ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించి మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని, లేకుంటే తమ దృష్టికి తీసుకురావాలని జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా సివిల్ సప్లయ్స్ పీడీ జి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 23 మంది రూట్ ఆఫీసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వారికి రూట్ మ్యాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూట్ ఆఫీసర్లు రూట్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ విభాగంలో కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌ను పోలింగ్ సిబ్బందికి మెటీరియల్‌ను అందజేసే కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామని, దానిలో 23 కౌంటర్‌లు ఉంటాయన్నారు. మధ్యాహ్నానికి డిస్ట్రిబ్యూషన్ పూర్తి చేయాలని, తరువాత ఒక్కొక్క రూట్‌కు బస్సులను తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌ను ఇస్తామని, ఎక్కడ ఇస్తే అక్కడే అదే సమయంలో వేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను బస్సుల్లో తీసుకెళ్లి విజయవాడ నిమ్రా కాలేజీకి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌తో సమీక్ష...

తహసీల్దార్ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ 10 మంది టీమ్‌తో ఆర్‌వో వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న 5 చెక్ పోస్టులైన గరికపాడు, గండ్రాయి, ముక్త్యాల, వత్సవాయి, శివాపురంలలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎప్పటికప్పుడు కవర్ చేస్తూ ఉండాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య వారు పట్టుకున్న సొత్తును, సామగ్రిని తమకు రిపోర్ట్ చేయాలన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఫీల్డ్‌లోకి వెళ్లి పరిశీలన చేసి ముందుగా ఫొటోలు తీయాలన్నారు. విధుల్లో అలసత్వం లేకుండా పారదర్శకత ఉండాలని సూచించారు. అక్రమ కరెన్సీని పట్టుకుంటే వెంటనే ఎఫ్ఐఆర్ చేయకుండా, వారు ధ్రువీకరణ పత్రాలు చూపించేందుకు కొంత సమయం ఇవ్వాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో ఏఈఆర్‌వో, తహసీల్దార్ శేషగిరి, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో రమేష్‌బాబు, సీఐ జానకీరామ్, ఎలక్షన్ డీటీ కిషోర్, సెక్టార్ ఆఫీసర్, మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రం పరిశీలించిన ఆర్డీఓ



పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: డివిజన్ పరిధిలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం పట్టణంలోని డాన్ బోస్కో, శ్రీ చైతన్య పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు..



జగ్గయ్యపేట నాగార్జున పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలలో సోమవారం ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జగ్గయ్యపేటలోని నాగార్జున పబ్లిక్ స్కూల్, విశ్వభారతి, అమ్మాణి కళాశాలల్లో, వత్సవాయిలోని వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో ఓపెన్ టెన్త్ పరీక్ష నిర్వహించారు.

ఎన్నికల విధుల్లో అధికారులు బిజీ



నందిగామ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో అధికారులు బిజీ బిజీగా ఉన్నారు. ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులకు ఉన్నతాధికారులు వాహనాలు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రవాణా శాఖ అధికారులు ప్రతి కారును తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించిన తర్వాత ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులకు అప్పగిస్తున్నారు.

మద్యం, డబ్బు రవాణా చేస్తే చర్యలు

వీరులపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రవాణా చేస్తే సహించేది లేదని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల వద్ద సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విజయవాడ రోడ్డులో ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారి ఆలయం 9 వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యం ప్రతినిధులు పీటలపై కూర్చోగా, అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.